# చెట్లు క్షమించవు

బి. వి. రమణారావు

ఎల్లుండి "బోటనీ" పరీక్ష. ఎంతచదివినా తరగటంలేదు. పైగా చదివినది చదవనిదీ ఒక్కలాగే వుంది. ప్రపంచంఅంతా "బోటనీ" మయమా అనిపిస్తుంది. దారిలో ఓ పువ్వుల మొక్క, చెట్టో, చివరికి గడ్డి కనబడినా పాఠాలు జ్ఞాపకానికొస్తున్నాయి. ఓమూల ఆకలి దంచేస్తుంది. ఇంకా అరమైలు నడవాలి అయ్యర్ గారి అన్నసత్రానికి. అయినా ఎవడికావాలీ వృక్షశాస్త్రం? ఈ చెట్లూ చేమలూ ఎలాపుట్టి ఎలా పెరిగి ఎలాచస్తే మనకేం? ఈ శాస్త్రజ్ఞులూరుకుంటారా?... పెల్లగించి రిసెర్చిచేసి, సిద్ధాంతీకరించి ప్రబంధాలు రాసి మా మొహాన్ని పడేస్తారు. పరీక్షల్లో యివే మా పాలిట యాటం బాంబులు.

కాని, ఆలోచిస్తున్నకొద్దీ ఈ వృక్ష జీవితానికి మానవజీవితానికిఏదోసన్నిహితసంబంధం కనబడుతుంది. చూడండీ ఈ యిద్దరు ప్రాణులూ ఎన్నో కష్టనష్టాల కోర్చి జీవిస్తారు. ఇక జీవిత లక్ష్యం కూడా ఒక్కటే... సంతానం. ఎక్కడ వాళ్ళ వంశం వాళ్ళతోటే అంతరిస్తుందో అన్న వెర్రి మమకారం కొద్దీ, మన తల్లితండ్రులు మనల్ని కని యీ భూమిమీదెలా పారేశారో అలాగే యీ చెట్లూను. ఇంక మనమధ్య తరగతి కుటుంబాల్లో యీ పెళ్ళికొడుకుల గొంతెమ్మ కోరికలు తీర్చడానికి, ఆడపిల్లలికి చదువు సంధ్యలనీ, అందచందాలనీ, కట్నాలు కానుకలనీ మనం ఎలా బాధ పడతామో అలాగే యీ చెట్లూ, ఈ సీతాకోక చిలుకల్ని ఈ తేనెటీగల్ని మెప్పించడానికి, ఆ పువ్వులుకి ఆకారమనీ, రంగనీ, సువాసననీ, మకరందమనీ ఎన్నోపాట్లు పడతాయి. కనీ, పెంచి, పెద్దవాళ్ళనిచేసి వాళ్ళ బ్రతుకులు వాళ్లు బతగ్గలరనే టంతవరకూ, పిల్లల్ని గురించి మనిషిపడే బాధే చెట్లూ పడతాయి. పువ్వు పూసి పువ్వు కాయై, కాయి పండై, ఆ పండులోని తమ సంతానమైన విత్తనాల్లో స్వతంత్రజీవనానికి కావల్సిన ఆహారాన్ని పరికరాల్ని అమర్చి, ఈ విశాల జగత్తులో ఎక్కడో అక్కడ సురక్షితంగా జీవించమని దీవించి తన విత్తనాల్ని వెదజల్లుతుంది. చూడండి! ఆ పుత్రవాత్సల్యం! నిజంగా యీ చెట్లకే నోరూ, కాళ్ళూ చేతులూవుంటే, తమతోటి ప్రాణులయిన మానవులతో తమ కష్టసుఖాలు చెప్పుకుంటూ ఏదైనా చెయ్యకలిగిన సహాయంచేస్తూ ఎంతో అన్యోన్యంగావుండే వనుకుంటాను. అసలు జె.సి. బోసు సిద్ధాంతం తల్చుకుంటే మతే పోతుంది. చెట్లుకూడా ఆనందిస్తాయిట, విచారిస్తాయిట, ఏడుస్తాయిట! తనకొమ్మ కొట్టేసినప్పుడో చెటు ఎంత ఏడ్చిందో కళ్ళకి కనబడేటట్టు ప్రయోగంతో నిరూపించి పారేశాడు. ఘోరం! దుర్మార్గుడు, అలా ఏడుస్తుంటే ఎలా చూడ కలిగాడో.

ఇలా ఆలోచించుకుంటూంటే హోటల్ ఒచ్చేసింది. లోపలి కెళ్ళాను. మామూలే. ఇంకా భోజనం చెయ్యవలసినవాళ్లు యిరవైమంది "క్యూ"లో వున్నారు. అప్పుడే ఓ లంబోదరుడు తనకంటె ముందర టిక్కట్లుకొన్నారని కోపమో ఏమిటోగాని "క్యూ"లో వున్న యిరవైమంది కేసి ఒక్కసారి త్రినేత్రంతో భస్మీభూతంచేసే ప్రళయరుద్రుడులాగ ఒక్కచూపు చూసి, బెంచీ మీద నాపక్కన బైఠాయిస్తూ నావైపు మరింత అనురాగంతో చూడ్డం మొదలెట్టాడు. అతని వరసంతా చూస్తే పలకరించేలా కనబడ్డాడు. అయినా ఎందుకయినా మంచిదని, అదీ కాక మనిషిచూస్తే, చులాగ్గా ఓ ఏనుగును కొరుక్కుతినేసేలా కనబడుతున్నాడు, పైగా దుష్టునికి

దగ్గరగా ఎందుకనీ, మెల్లగా మూలకినక్కి, ఓ కాలు బెంచీమీద మోపి, గోడకి జార్లాపడి కళ్ళు మూశాను.

టేబుల్ ముందర చలికిలపడ్డాను. ఎదురుగుండా కూర్చున్నాడా అపర నరసింహావతారం. అప్పుడే ఓ ప్లేటు ఖాళీచేశాడు. ప్లేటునిండా ఎముకలు మిగిలాయి. ఇంకో ప్లేటు మాంసం తెమ్మన్నాడు. సర్వర్ నన్నడిగేడు "మాంసాహారమా? శాకాహారమా" అని.

"శాకాహారం" అన్నాను. ఎదురుగుండా వున్న మనిషి చురచుర నా మొహంకేసి చూసి, సర్వర్‌తో "వెళ్ళకి ప్రత్యేకస్థలం లేదా" అన్నాడు. "లేద"ని సర్వర్ లోపలికిపోయాడు. తలపైకెత్తకుండా మళ్ళీ తినడం మొదలెట్టాడు. సర్వర్ నాకో ప్లేట్లో అన్నం రెండు చిన్న ప్లేట్లలో ములక్కాడల సాంబార్, చిక్కుడుకాయల కూర తెచ్చి పెట్టాడు. రెండూ కాస్త యిష్టమయినవేకదా అనుకుంటూ టేబుల్ మధ్యగా పెట్టిన ప్లేట్లు దగ్గరగా లాక్కున్నాను. "ఫర్వాలేదుకే" అన్నాడా విగ్రహం. నాకర్థంకాలేదు. నేను సాంబారూ అన్నంతింటుంటే అతనికేం "ఫర్వా"? తలపైకెత్తిచూశాను. నాప్లేటు కనబడకుండా కళ్ళకి తనచెయ్యి అడ్డంపెట్టుకుని తింటున్నాడు.

ఏదో దొంగతనంచేస్తున్నట్లు ప్లేటు చప్పుడు కాకుండా నెమ్మదిగా దగ్గిరకి లాంక్కుటున్నాను.

"ఏవూరు మీది" అన్నాడు.

అసలు సమాధానం చెప్పకూడదనుకున్నాను, ఆ నిరసనభావం చూసి. కాని మరి, అతని ఆకార పరిమాణమో, ఆ బోద్దుమీసాలో మరి ప్లేట్లో ఎముకలో తెలీదునాకు తెలియకుండానే నాచేత సమాధానం చెప్పించాయి. నెమ్మదిగా ఎవళ్ళో గొంతుక నొక్కేస్తున్నట్లు "చింతపేట" అన్నాను.

"ఏం చేస్తున్నావు?"

"ఇంటర్ పరీక్షకెడుతున్నాను." మళ్ళీ సమాధానం తప్పలేదు.

"ఏమిటి గ్రూపు?"

"బోటనీ, జుఆలజీ, కెమిస్ట్రీ." కాస్త ధైర్యం వొచ్చింది.

"హుఁ... బోటనీయా... అర్థంచేసుకునే చదువుతున్నావా?"

"ఏం?" అన్నాను. అసలు యీ ప్రశ్న మా బోటనీప్రొఫెసర్ అడుగుతే కత్తిలాగ "ఓయస్" అనేవాడిని. కాని యీ మానవపర్వతం ముందర నసగవల్సివచ్చింది.

"అహాఁ... అసలు అడుగుతున్నాను... ఊఁ మొక్కల్లో ప్రాణం వుంటుందా?"

"ఆ"

"మరి... నోరో"

"లేదు."

"హుఁ... అయితే అంతా తెలుసుండే చేస్తున్నావన్నమాట. అందుకే యీ మానవలోకంలో యీ అన్యాయాలు, దుర్మార్గాలు, ఈ కరువులు యుద్ధాలు పెచ్చుపెరిగిపోతున్నాయి. వాటి వుసురు తగలకుండా పోతుందా?"

"నేచేసే తప్పేమిటో నాకర్థంకావటం లేదు" అన్నాను యీ విపరీత ధోరణి అర్థంకాక.

"ఎందుకర్థమవుతుందీ? హుఁ... తరతరాలుగా నీ రక్తంలో జీర్ణించిన అజ్ఞాన తిమిరంలో, నీ, పాపపుణ్య విచక్షణాశక్తికూడా నశించింది. నీతో సమానంగా యీభూమిమీద పుట్టి పెరిగిన నీతోటి ప్రాణులయిన యీ అమాయకపు నోరులేనిచెట్లూ చేమల్నీ హింసించి వాట్ల శవాల్ని ముక్కముక్కలుగాచేసి భక్షించి ఆనందించడమే నీ నాగరకత అన్నమాట .. అవునా?"

నేనూ ప్లేట్లో చెయ్యిపెట్టబోతున్నా కలుపుకోడానికి. టక్కుమని యీమాటల్లో చెయ్యి లాగేశాను. ఏదో కాస్త యిష్టమయిన కూరా పులుసూ వొండేడనుకుంటే మధ్యన యీ బాధేమిటి... పెళ్ళిలో చావుబాజాలాగ. అంతవరకూ ఒక్క మెతుకుకోరికితే మీతోడు. ఒళ్ళుమండింది.

"అయితే యింక ఏం తినిబతకమంటారూ?" అన్నాను, కాస్త స్వరం హెచ్చించి.

"మనమంతా జంతుజాతిలోకి చెందినవాళ్ళం. మన జాతిలో మనం ఒకళ్ళనొకళ్లు చంపుకు తినొచ్చు. అది ధర్మం. చూడు, చిన్న చేపల్ని పెద్దచేపలు తింటాయి, పురుగుల్ని కోళ్లు తింటాయి. ఈ చేపల్ని కోళ్ళనీ మేకల్ని మనం తింటాము. మనల్ని పులులూ, సింహాలూ తింటాయి. ఇది మన జాతిధర్మం ఏమంటావ్?'

"ఊఁ" అన్నాను ఆలోచన తోచక.

"అలా ఓజంతువునుంచి ఓజంతువు తప్పించుక తిరుగుతుంది. ఆయువు మూడితే పెద్దజంతువు

చేతులో చిక్కుతుంటుంది. ఇదీ మానవాదిజంతువులు జీవించే విధానం. మాట్లాడవేం?"

ఇంతలోనే ఓ చిన్న మెరుగుతీగలాంటి ఆలోచన తట్టింది. తక్షణం ఆగ్నేయాస్త్రంలాగ వాదుల్తూ, "అయితే యీ చెట్లు, రంగురంగులతో వింత సువాసనలతో ఎంతో రుచిగా, యీపళ్లూ కాయలూ ఎందుకు కాస్తున్నాయి?" అన్నాను, తప్పదు యీ దెబ్బతో వెర్రిమొహం వేస్తాడన్న ధైర్యంతో.

"ఓరి. అమాయకుడా!" అంటూ మొదలెట్టాడు నా ఆగ్నేయాస్త్రాన్ని ఈగనితోలినట్టు లెక్కచెయ్యకుండా. ఒక్కసారి ఛీంకారంచేసి గొంతుక సవరించుకుని "అయితే విను. మొదటి నుంచీ ఈ వృక్షజాతి మన జంతుజాతి దౌర్జన్యం నుంచి రక్షించుకోడానికి సామదానభేద దండోపాయాలవలంబించింది. అసలు పరిణామ సిద్ధాంతరీత్యా చూస్తే మొదట్లో జంతుజాతికి కూడా నీతి నియమం ఉండేది. జంతువులు జంతువుల్నే తినేవి. కాని జంతువులకి రానురాను పిక్కబలం ఎక్కువవ్వడంతోటే దప్పించుకు పారిపోవడం మొదలెట్టాయి. ఓమూల తనకంటే పెద్ద జంతువుల్నించే తప్పించుకు తిరగడం మరోమూల తన ఆకలి తీరడానికి తనకంటే చిన్నజంతువుల్ని తరిమి పట్టుకోవడం, మధ్యమధ్య వాటి ప్రేమ విహారాలు. యిలాగ నవరస భరితమైన ఒకదివ్య వాతావరణంలో మహదానందంగా జీవించేవి. కొంతకాలానికి, కొన్ని నీచ జంతువులకి తుచ్ఛ కామభోగాలమీద ఆసక్తి ఎక్కువయ్యి, ప్రకృతి సిద్ధమైన పౌరుషాభిమానాలు విడిచిపెట్టి, తోక ముడిచి, పిరికిపందలయ్యి, కొండల్లోనూ, గుహల్లోనూ తలదాచుకుంటూ, నోరూ వాపీ, కాళ్లూ చేతులూలేని ఈ అమాయక వృక్షజాతిని కబలించడం మొదలెట్టాయి... అర్థమవుతుందా?"

"ఆహా! కాని నేనడిగిన ప్రశ్న..."

"ఆ విషయానికే వస్తున్నాను. ఏనాడు ఈ హేయపరిణామం జంతువుల్లో కలిగిందో, ఆనాటి నుంచీ వృక్షజాతిలో దుర్బలమైన, వరీ, జొన్న, గోధుమ, కంది, పెసర మొదలయిన మొక్కలు యీ జంతువుల ఆకలికి బలి అయ్యేయి. ఇదిచూసి కంగారు పడి, కందా, చామా, అల్లం, ఉల్లిపాయి వేరుశనగాలాంటి మొక్కలు ప్రాణాపాయం రాకుండా వాట్ల ముఖ్యమైన శరీరభాగాల్ని భూమిలో జాగ్రత్తగా పాతిపెట్టి ఏమీ తెలియనట్టుగా నాలుగాకులూ రెమ్మలూ భూమిమీద పెట్టడం మొదలెట్టాయి. ఎంత పరిణామం చెందినా, మనిషి తనలో ఆ పందికొక్కు రక్తం కోల్పోలేదు. ఊరుకున్నాడా? పెల్లగించి తినడం మొదలెట్టాడు. దీనితోటి హడిలిపోయి బీరా, పొట్లా, ఆనపా మొదలయినవి పక్కన కనబడ్డ ఏచెట్టునో పుట్టనో కౌగలించుకుని, ఎక్కడో అందకుండా పైన కాయలు కాయడం మొదలెట్టాయి. కాని అవిమాత్రం ఆగుతాయా, తీగలు పళంగా లాగేసితినడం మొదలెట్టాడు, ఇదిచూసి లాగెయ్యడానికి వీల్లేకుండా గట్టిశరీరాన్ని పెంచి వెలగా, ములగా, జామిలాంటిచెట్లు కొమ్మలచివర్ల కాయలు కాయడం మొదలెట్టాయి. కాని కోతులూ, కోతుల్లోంచి పరిణామం చెందిన మనుష్యులకీ, యివో లెక్కా. ఇదీ లాభంలేదని, కొబ్బరీ, తాటీ, పోకాలాంటి చెట్లు, ఈ జంతువులు ఎక్కడానికి వీల్లేకుండా కొమ్మలు విసర్జించాయి. అప్పట్లో పెద్దజంతువులన్నీ వెర్రిమొహాలేశాయి. కాని యేం లాభం... ఇన్ని చేసినా పాపం! ఈ ఉడతలబాధ తప్పించుకోలేకపోయాయి. దీనితోటి ఇదిపనికాదని; వేప, కుంకుడు, లాంటివి చేదుకాయలూ, చింతా ఉసిరీలాంటివి పుల్లటికాయలూ, వగరుగా కరక్కాయలూ, నోరుమండించేటట్లు మిరపకాయలూ, కొన్ని విషపుకాయలు, ఇంకాకొన్ని పిచ్చెత్తించే కాయలూ... యిలా కాయడం మొదలెట్టాయి. కాని మానవుడు తన మేధస్సువృద్ధయిన కొద్దీ తన హింసాదృక్పథాన్నికూడా ద్విగుణీకృతంచేస్తూ, ఈ కాయలని టినీ, రుచీ, మందూమాకూ అని పేర్లతో తననిత్యజీవిత తో ఉపయోగించుకోవడం మొదలెట్టాడు... వింటున్నావా తరతరాలుగా మానవాది మృగాలు ఈ వృక్ష జాతిని చేసే చిత్రవధాకల్పం?"

"కరతలామలకంచేశారు...యింతకీ తియ్యని పళ్ళు కాయలూ మాట శలవిచ్చారు కారు" అన్నాను కళ్ళు తుడుచుకుని ముక్కుఎగబీలుస్తూ.

"అదేచెబుతున్నాను. బాబూ, కొంచెం ఓర్పు నేర్చుకో... ఎప్పుడైతే మానవాది జంతువుల దుష్టసంకల్పం ముందర తమ ప్రయత్నాలన్నీ

విఫలమయ్యాయో, ఆనాడు మామిడి, నారింజ, రేగి, ద్రాక్ష, ఖర్జూరం, సీతాఫలం మొదలయిన ఫలవృక్షాలన్నీ ఓ తీర్మానం చేశాయి. ఏమిటా తీర్మానం?... తమ వంశాభివృద్ధికి మూలకారణమైన ఆ గింజల్ని గట్టిగానో చేదుగానో సృష్టించి వాట్లని మెత్తటి తియ్యటి పళ్ళల్లో వుంచి ప్రదర్శించడం. అంటే మానవుడు ఆ మెత్తటి తియ్యటి పండు భాగాన్ని తిని, గింజల్ని పారేస్తాడు. అవి భూమిమీద పడి మొలకలెత్తుతాయి. అంటే బకాసురుడికి బండెడన్నమిచ్చి మనిషిని మరిపించడం లాంటిది ఇప్పుడర్థమయ్యిందా, వెర్రి తండ్రీ, కాని. హుం... ఇన్ని చేసినా మానవుడికి తృప్తికలగ లేదు. జీడి మామిడి పండు తిని, గింజలు కూడా బద్దలుకొట్టుకు తింటున్నాడు. పనస తొనలతో బాటు గింజలూ, బాదంపండుతో పాటు పప్పూ, మొదలెట్టాడు. అంతటితో ఆగిందా? ఈ పరమాణు యుగం వచ్చేటప్పటికి మానవుడు, వెర్రి ద్వేష ఆవేశాల్తో చెట్లుచెట్లు పళంగానే తినెయ్యడం మొదలెట్టాడు. చూడు, కొత్తిమీర, తోటకూర, మెంతికూర, బచ్చలి, మొదలయినవి. ఛీ, ఛీ, ఛీ, ఎంత ఉచ్ఛస్థితిలోనుంచి ఎంత నీచస్థితికి పరిణామం చెందాడు ఈ మానవుడు! హు, అసలు మృగరాజెవరు తెలుసా?"

"సింహం" అన్నాను వొణికే గొంతుకతో.

"హుం నీకేం తెలుసు. ఈనాడు ధైర్య సాహసాల్లో జంతుజాతి కంతకీ మకుటంలా వర్ధిల్లే మానవుడు. మిగతా పిరికి జంతువులతో పాటు, భోగ విలాసాల్లో పడి, నీచ శాకాహారాని కొడిగట్టాడు. లేకపోతే తన మేధస్సుతో విశ్వాన్నంతా గజగజ వణికించిన మానవుడు మృగరాజపదవి సింహానికివదిలెయ్యవలసివచ్చునా? ఆనాటి పిరికిపందల సంతతవ్వడంవలననే మనకీ శాకాహారం అబ్బింది. ఏదీ ఓ బంగినపల్లి మామిడి పండో, వర్లపూడి నారింజపండో సింహానికిచ్చి చూడు తింటుందేమో. హుం అందుకే "వనరాజ నిజకర విదారిత హస్తిమస్తమస్తిష్కమునే తినుగాని" అన్నాడు విష్ణుశర్మ. ఏం, అలా వెర్రి మొహం వేశావు. అర్థం కాలేదూ? అంటే సింహం, మనుషుల్లాగ, ఎక్కడో యేరిన గింజలో ఎక్కడో కోసిన మాంసం ముక్కో వండుకుని Second Hand తిండి తినేటంత హీన జీవి కాదన్నమాట. స్వహస్తాల్తో సంపాదించుకున్న తిండే తింటుంది. ఏనాడు మానవుడు నిరపరాధులూ నిస్సహాయులూ అయిన యీ వృక్షజాతిమీద పడి ఒబళించడం మొదలెట్టాడో ఆనాడే అతని ధైర్యసాహసాలడుగంటేయి. అంతవరకూ మనిషికి జడిసేపసి పాం, ఈ కష్టాన్ని చూసి లోపల కట్టేసి, ఒక్కసారి విశ్వం దద్దరిల్లేలాగ గర్జించి మానవుణ్ణి బెదరగొట్టి, వనరాజై కూర్చుంది. దీనికి దృష్టాంతరం పురాణంలో చూపెట్టమంటావా... శాకాహారం తినడం మొదలెట్టిన శ్రీమన్నారాయణుడు, పిరికివాడై, ఆత్మవిశ్వాసం కోల్పోయి ప్రహ్లాదుణ్ణి రక్షించడానికి హిరణ్యకశిపుణ్ణి స్వహస్తాల్తో చంపవలసి వచ్చినప్పుడు, చచ్చినట్లు సింహరూపం దాల్చవల్సి వచ్చింది. ఏమంటావ్" ఆవేశంతో ఆయన మొహం ఎర్రబడిపోయింది. గొంతుక రుద్రమై పోయింది. కళ్లు చిచ్చుబుడ్లలాగ జ్ఞానజ్యోతుల్ని వెదజల్లుతున్నాయి.

కేవలం నా అజ్ఞానాంధకారం పటాపంచలు చేసి జ్ఞానజ్యోతిని ప్రసాదించడానికి సాక్షాత్కరించిన ఆ దివ్యమూర్తికి నా మనసులోనే సాష్టాంగ నమస్కార సహస్రములర్పిస్తూ, జ్ఞానోదయంతో ఉక్కిరిబిక్కిరై, ఆవేశం గొంతుకు కడ్డంపడి, నోరు పెగలక, కష్టంమీద, కళ్లుమూసుకుని, ఊపిరి బిగపెట్టి... "అవును" అనగలిగేను.

క్షణం నిశ్శబ్దం. కొంపతీసి గబుక్కున మాయమయ్యేడేమోనని అనుమానం వేసి కళ్లు తెరిచి చూశాను. ఆ విజ్ఞానపర్వతం యింకా అలాగే వున్నాడు. అదృశ్యమవలేదు. తన చేత్తో చూపెడుతూ "అలా చూడు" అన్నాడు. ఏ భయంకర స్వరంగమేనా కనబడుతుందేమోననే భయంతో, గుండె దడదడ చేత్తో అణుచుకుంటూ, నెమ్మదిగా పక్కకి తిరిగాను.

"చూడు ఆ చిక్కుడు మొక్క" అన్నాడు. కిటికీలోంచి ఓ చిక్కుడుతీగ కిటికీ తలుపుకులగిలి గాలికి టకటక కొట్టుకుంటుంది. "కనబడింగా - పాపం! ఏ పాపమెరగని తన జాతి అమాయిక సంతానమనుభవిస్తున్న ఆ దుర్భర చిత్రవధని చూడలేక, గుండెలు బద్దలయ్యేటట్లు, తల మొత్తుకుంటూ చేస్తున్న ఆదీనాక్రందన వినబడుతుందా"

ప్రతీ అక్షరం ఇంజక్షన్ సూదుల్లాగ గుచ్చుకుంది. నా ప్లేట్లోంచి, చిక్కుడు గింజలు మొక్కలు మొలిచి, తీగెలు వేసి నా ఎదురుగుండా నిలబడి, చేతులు జోడించి దీనంగా ప్రార్థిస్తున్నట్లు కనబడింది.

"ఆ ములక్కాడ ముక్కల కేసి, నీ ప్లేట్లో అన్నం కేసి ఒక్కసారి చూడు. అందులో ఒక్కొక్క "గింజా" తల్లి కడుపున ఎంత ఆప్యాయంగా పుట్టి, ఎంత గారాంగా పెరిగిందో, ఈ నాటితో నీ పొట్టి ఆకలికి బలి అయిపోతే, ఒక్కొక్క గింజ ఒక్కొక్క మొక్క. పచ్చటి పొలాల్లో, చల్లగాలికి గర్వంగా తలలూపుతూ ప్రకృతికి జోలపాడేవి. ఈనాడు యీ గింజ శవ సహస్రాల్ని నువ్వు ఆనందంగా ఆరగిస్తుంటే ఆ కన్నతల్లి గర్భశోకం ఎలా వుంటుందో ఆలోచించావా?" ఆయన కళ్లు చెమ్మగిల్లాయి.

"స్వామీ...అజ్ఞానిని...అపరాధిని" అని మాత్రం అనకలిగేను.

"మనకి ప్రాణావసరమైన ప్రాణవాయువు మనకిచ్చి, బొగ్గులిని కాలక్షేపం చేస్తూ, కొట్టినా తిట్టినా సహించి ఎండఘూపుల్లో చెంతచేరిన ప్రతి జంతువుకూ చల్లదనాన్నిస్తూ, పళ్ళూ కాయలూ యిస్తూ జీవించే యీ త్యాగజీవులకు నువ్వు చేసే ప్రత్యుపకారం ఏమిటి? వాటి సమక్షంలోనే వాటి సంతానమైన పళ్లూ, కాయలూ, గింజలూ భక్షిస్తూ, వాటి శరీరభాగాన్ని తెగ నరికి వాటితో దూలాలూ, తలుపులూ. కుర్చీలు, బల్లలూ. బళ్ళూ చేసి. పొయ్యిలో పెట్టి బొగ్గు చేసి, ఈ బొగ్గును కుంపట్లో పెట్టి మసిచేసి ఆనందిస్తావు అవునా?" ఆయన కన్నీళ్లు జలజల రాల్తున్నాయి.

"ఓ వృక్షోద్ధారకా! మహాపాపిని, కిరాతకుణ్ణి."

"విచారించి ఏం ప్రయోజనం? ఆలోచించు నాయనా. ఈ వృక్షజాతికే కాళ్ళూ చేతులూ నోరూ వుండి, మీ తమ్ముణ్ణో మీ చెల్లెల్నో నంచుకుతింటూ, మీ తాతయ్య అస్థిపంజరంతో, తమ ముద్దుబిడ్డలైన విత్తనాలికి ఉయ్యాలా తయారుచేసి, అందులో ఊపుతూ జోలపాడుతూ వుంటే, చిన్నచెట్లు ఆడుకోడానికి నీ బుజాలెక్కి నీ జుట్టుపట్టుకు వేళ్ళాడుతూ సరదాకి, ఏ వేలో కాలో చెయ్యో విరగ్గొడుతుంటే నీ కెలా వుంటుంది?"

"ఓ వృక్షరక్షణ దీక్షాపరాయణా! తమ కర్ణ కఠోర వాక్శరంగుల భీకరధ్వనిఘాటి కాగలేను." అన్నాను కుంభవృష్టిని కురుస్తున్న ఆయన అశ్రుధారలు నా జేబురుమ్మాలుతో వొత్తుతూ.

"త్రబ్బాయీ"

"చిత్తం."

"ఒక్కసారి నీ హృదయ చక్షువులు తెరచి చూడు. అదిగో ఆ వృక్షజాతిలో విజృంభిస్తున్న ప్రచండ విప్లవకల్లోలం, మానవ లోకోద్ధారణకై జన్మించిన లెనిన్, ఈనాడు వృక్షజాతిలో Bacteria రూపంలో జన్మించాడు. అదిగో Sun Dew, అదిగో Bladder wort, అదిగో Pitcher plant, కనబడుతున్నాయా ఆ జంతువుల్ని తినే మొక్కలు? పరిణామం పూర్తవలేదు. చెట్లుకూడా నడుస్తాయి, ఎగురుతాయి, పగసాధిస్తాయి భవిష్యత్తు భయానకం...చెట్లు క్షమించవు."

"ఘోర మహాత్మా! .. అదిగో కనబడుతున్నాయ్ జంతుశిక్షణకి, వృక్ష రక్షణకి బద్ధకంకణం ధరించి. వికృతాకృతులతో, నవ్య భూజాలు, వింత ధ్వజాలతో మానవ పతనాన్ని స్ఫురింపజేసే భయంకర నినాదాలతో "హరోం హరోహర, హరహర, హరహర, హరోంహరా" యంటూ హృదాంతరాళం గర్జిస్తూ వస్తున్నాయ్. అవిగో...వినబడుతున్నాయ్...గావుకేకలు... "ప్రేక్షకా నిరీక్షించి, పరీక్షించు, నిర్దాక్షిణ్యముగా ఈ వృక్షాలే రేపు నిన్ను కక్షకట్టి చీల్చి చెండాడి శిక్షించి భక్షిస్తాయి" ఆహా!... ఏమి యమకావేశం! అదిగో ప్రకృతి నిట్టూర్చింది .. మేఘాలు గర్జించాయి. ఆదిశేషువు భుజం మార్చేడు. విశ్వం కంపించింది. కాలసర్పం పడగ ఎత్తింది, జగన్నాథ రథం కదిలింది. అవిగో... రథచక్రాల్... రథచక్రాల్."

అయ్యర్ కుదుపుకి మెళుకువ వచ్చింది. "ఖాళీ అయింది వెళ్ళండి సార్" అన్నాడు.

ఆకు తుడుచుకుంటూ సర్వర్‌తో "ఏమిటి వంటలు?" అన్నాను.

"చిక్కుడుకాయి కూర... ములక్కాడ సాంబార్" అన్నాడు, టిక్కట్టు సర్వర్‌కి అందిస్తుంటే చేతులు వొణికాయి.